

11 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 11 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రాయింగ్ (లోయర్‌గ్రేడ్, హయ్యర్‌గ్రేడ్) పరీక్షలు జనవరి 11,12, 16,17 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి 12.30, 2 గంటల నుంచి 4.30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. టైలరింగ్ ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్, హయ్యర్‌గ్రేడ్ పరీక్ష 11,12,16న ఉదయం 10 గంటల నుంచి 12.30, 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షలన్నీ కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తామని తెలిపారు.

కాంగ్రెస్‌దే హవా!

జహీరాబాద్ ఎంపీగా ఎన్నికైన సురేష్‌షెట్కార్



ఎంపీ ఎన్నికల్లో ఓటింగ్ కోసం క్యూలో ఉన్న మహిళలు



- ఈ సంవత్సరంలోనూ జిల్లాలో కాంగ్రెస్‌దే పైచేయి
- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు
- ఎంపీగా విజయం సాధించిన సురేష్ షెట్కార్
- కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం కాంగ్రెస్ గూటికి
- పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీజేపీలోకి బీఆర్‌ఎస్ ఎంపీ బీబీ పాటిల్ చేరిక
- కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల కైవసం
- ముగిసిన సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీల పదవీకాలం
- ప్రభుత్వ వైఫల్యాలపై గళం విప్పుతున్న బీఆర్‌ఎస్, బీజేపీలు



కామారెడ్డి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా సత్తాచాటిన కాంగ్రెస్ పార్టీ అదే ఊపును 2024లోనూ కొనసాగించింది. పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తన హవాను కొనసాగించింది. జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ సీటును ఆ పార్టీ కైవసం చేసుకుంది. అదేవిధంగా వలసలను ప్రోత్సహిస్తు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకుంది. బాన్సువాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి లాంటి ముఖ్యనేతతో పాటు పలువురు కౌన్సిలర్‌లు, మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కాంగ్రెస్‌లోకి క్యూకట్టారు. ఇందులో భాగంగానే కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలను కాంగ్రెస్ తన వశం చేసుకుంది. బీఆర్‌ఎస్‌కు చెందిన ముఖ్యనేతలు కాంగ్రెస్‌లోకి వలసలు వెళ్లడంతో ఆ పార్టీ బలహీనపడింది. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై బీఆర్‌ఎస్ పోరటాలు చేస్తూ వచ్చి ంది. అదేవిధంగా బీజేపీ సైతం ప్రజా సమస్యలపై పోరాడుతోంది. జిల్లాలో కామారెడ్డి నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అధికారులతో సమీక్ష చేస్తునే రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై నిరసనలు చేపడుతున్నారు. జిల్లాలో 2024 కాల చక్రం గిర్రున తిరిగిపోయింది. మరో మూడు రోజుల్లో ఈ ఏడాది ముగియనుంది. జిల్లాలో ఈ సంవత్సరంలో జరిగిన రాజకీయ విశేషాలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే పైచేయి

ఈ ఏడాది మేలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో అధికార పార్టీ కాంగ్రెస్ పైచేయి సాధించింది. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ స్థానం నుంచి ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీల మధ్యే పోటీ హోరాహోరీగా సాగింది. కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్‌షెట్కార్, బీజేపీ నుంచి బీబీ పాటిల్, బీఆర్‌ఎస్ తరపున గాలి అనిల్‌కుమార్‌లు బరిలో నిలిచారు. వీరి తరపున ప్రధాన పార్టీల అధినేతలైన సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ నేత ప్రియాంకాగాంధీ, మాజీ సీఎం కేసీఆర్ ప్రచారం నిర్వహించారు. సుమారు నెల రోజుల పాటు ప్రచారం కొనసాగింది. మే 13న పార్లమెంట్ పోలింగ్ జరిగింది. జూన్ 4న ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ 47,893 ఓట్లతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థికి 5,23,919 ఓట్లు రాగా బీజేపీకి 4,76,023, బీఆర్‌ఎస్‌కు 1,71,412 ఓట్లు వచ్చాయి.

పోచారం కాంగ్రెస్‌లోకి.. బీజేపీలోకి బీబీ పాటిల్

గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో పలువురు కీలకనేతలు అధికార పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతూ వచ్చారు. మొదట్లో ద్వితీయ శ్రేణి నేతలు మాత్రమే పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రతిపక్షాల నేతలను పార్టీలో చేర్చుకునే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లను పెద్ద మొత్తంలోనే కాంగ్రెస్‌లో చేర్పించుకున్నారు. బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడంతో పలువురు ముఖ్యనేతలు ఆ పార్టీని వీడుతూ వచ్చారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ఆ పార్టీకి పెద్ద షాక్ ఇచ్చారు. మార్చి 1న మాజీ ఎంపీ బీబీ పాటిల్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. బీజేపీ అధిష్ఠానం సైతం జహీరాబాద్ ఎంపీ టికెట్‌ను పాటిల్‌కే కేటాయిస్తూ ప్రకటించింది. ఇక జిల్లాలో బీఆర్‌ఎస్‌కు చెందిన కీలకనేత పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆ పార్టీని వీడక తప్పలేదు. బీఆర్‌ఎస్ హయాంలో మంత్రి పదవి, స్పీకర్ లాంటి ఉన్నత పదవులు చేపట్టినప్పటికీ బాన్సువాడ అభివృద్ధే ధ్యేయంగా జూన్ 21న బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరారు.

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న పోచారం



బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరుతున్న ఎంపీ బీబీ పాటిల్

కామారెడ్డి చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న గడ్డం ఇందుప్రియ

కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలు కాంగ్రెస్ వశం

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ ఏడాది జిల్లాలో రాజకీయం పూర్తిగా మారిపోయింది. ప్రధాన పక్షాలకు చెందిన ముఖ్యనేతలు కాంగ్రెస్‌లోకి వలసలు వెళ్లారు. ప్రధానంగా కాంగ్రెస్ ఆయా మున్సిపాలిటీలపై కన్నేసింది. మున్సిపాలిటీలను కాంగ్రెస్ వశం చేసుకునేందుకు స్థానిక నేతలు పావులు కదుపుతూ వచ్చారు. ఇందులో భాగంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లోని బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్‌లను కాంగ్రెస్‌లో చేర్చుకుని మెజార్టీ పెంచుకుని బీఆర్‌ఎస్ చైర్‌పర్సన్‌లపై అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టారు. కామారెడ్డి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నిట్టు జాహ్నవి నాలుగు సంవత్సరాల పాటు కొనసాగింది. అయితే ఏప్రిల్‌లో కాంగ్రెస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టింది. బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌లో చేరడంతో 27కి బలం చేకూరింది. దీంతో కాంగ్రెస్ అవిశ్వాసాన్ని నెగ్గడంతో ఆ పార్టీకి చెందిన వైస్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఎల్లారెడ్డి మున్సిపాలిటీని సైతం కాంగ్రెస్ కైవసం చేసుకుంది.

సర్పంచ్‌లు, జడ్పీటీసీల ముగిసిన పదవికాలం

ఈ ఏడాదిలోనే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవి కాలం సైతం ముగిసింది. ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల పదవి కాలం ముగియగానే ప్రభుత్వం జీపీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. అదేవిధంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీల పదవి కాలం సైతం జూలైలో ముగియడంతో ప్రత్యేకాధికారులను కేటాయించారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన దఫేదార్ శోభ కొనసాగుతూ వచ్చారు. మధ్యలో చైర్‌పర్సన్‌పై జడ్పీటీసీ, ఎంపీపీలు అవిశ్వాసం పెట్టాలని ప్రయత్నించినప్పటికీ విఫలమైంది. పదవికాలం ముగిసే వరకు దఫేదార్ శోభనే చైర్మన్‌గా కొనసాగుతూ వచ్చారు. అదేవిధంగా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ద్వితీయ శ్రేణి నేతలకు నామినేట్ పదవుల భర్తీ చేసింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా చంద్రకాంత్‌రెడ్డి అదేవిధంగా కామారెడ్డి మినహాయించి అన్ని మార్కెట్ కమిటీల పాలకవర్గాలను కాంగ్రెస్ నేతలతో ప్రభుత్వం భర్తీ చేసింది.



ముగ్గురు ఆత్మహత్యలపై

సీన్ రీకన్‌స్ట్రక్షన్

- మృతుల ఫోన్‌కాల్స్, వాట్సప్ చాటింగ్‌లో కీలక విషయాలు
- ఆత్మహత్యలపై శృతి, నిఖిల్ ముందుగానే వాట్సప్‌లో చాటింగ్‌ను గుర్తించిన పోలీసులు
- వీటి ఆధారంగా సంఘటన స్థలం చెరువు వద్ద రీ కన్‌స్ట్రక్షన్ చేసిన పోలీసులు

6

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతంగా నిర్వహించాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతంగా, పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పారిశుధ్యం, తాగు నీరు, ఇంటి పన్ను వసూళ్లు, సీసీ చార్జీలు, ట్రాక్టర్ నెలవారి వాయిదాల చెల్లింపులు, కంపోస్టు ఎరువుల తయారీ, భవన నిర్మాణాల అనుమతులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే, వన మహోత్సవం, ఉపాధిహామీ, మహిళ శక్తి అంశాలపై ఎంపీడీవో, ఎంపీవో, మిషన్ భగీరథ ఇంజనీర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే జనవరి 3లోగా పూర్తి చేయాలని అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సర్వే తీరును పరిశీలించాలని తెలిపారు. జిల్లాలో 2,38,682 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని ఇప్పటి వరకు 1,39,194 మంది సర్వే జరిగిందని, 62 శాతం మేర సర్వే పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగించాలని తెలిపారు. మురికి కాల్వల్లో చెత్తతో నీరు రోడ్లపైకి రాకుండా శుభ్రపరచాలని తెలిపారు. దోమల వ్యాప్తి నివారణకు పిచికారీ చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వచ్చే వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. గత సంవత్సరంలోని అనుభవాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, ఏమైన లీకేజీ ఉంటే ముందుగా శుభ్రం చేయాలని తెలిపారు. వన మహోత్సవం కార్యక్రమం కింద బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తి చేసి, విత్తనాలు నాటాలని తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలని, లేబర్ మొబైలైజేషన్ చేయాలని అన్నారు. మహిళ శక్తి కార్యక్రమం కింద బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి కింద రుణాలు మంజూరు చేయడం తీసుకున్న రుణాలను వసూళ్లు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ సీఈవో చందర్‌నాయక్, డీఆర్‌డీవో గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, మిషన్ భగీరథ గృహ నిర్మాణం, ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామీణాభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



ఎల్లారెడ్డి కాంగ్రెస్‌లోకి వలసల జోరు

- ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో చేరికలు
- స్థానిక ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు నేతలు

7




బిచ్కుందలో ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

కేజీబీవీ విద్యార్థినుల ఆందోళన

- టీచర్లు లేక చదువులో వెనుకబడిపోతున్నామని ఆవేదన

బిచ్కుంద, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : బిచ్కుందలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ఆవరణలో శనివారం విద్యార్థినులు ఆందోళన చేశారు. కేజీబీవీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం గత కొన్నిరోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో తమకు బోధించే ఉపాధ్యాయులు లేక చదువులో వెనుకబడి పోతున్నామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి.. టీచర్ల సమస్యలను పరిష్కరించి విధుల్లో చేరేలా చూడాలని విద్యార్థినులు కోరారు. అప్పుడే తమకు బోధనాపరంగా న్యాయం జరుగుతుందని వారు తెలిపారు.



నల్లమడుగు సొసైటీలో ఎరువులను తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి

ఎరువులను అందుబాటులో ఉంచాలి

లింగంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సొసైటీల్లో సీఈవోలు ఎరువులను అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయశాఖ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. ఆయన శనివారం లింగంపేట మండలంలోని లింగంపేట, నల్లమడుగు, శెట్పల్లి సంగారెడ్డి, ఐలాపూర్‌లలో సొసైటీ గోదాంలను, మండల కేంద్రంలోని ప్రైవేటు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎరువులు రైతులకు సరిపడా ఉంచాలని ఎరువుల కోసం రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా నిల్వలు ఉంచాలని ఆయన సూచించారు. దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువుల రిజిస్టర్‌లను ఆయన తనిఖీ చేశారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కామశాస్త్రి

బోధన్‌రూరల్,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విజయసాయి విద్యాసంస్థల మాజీ డైరెక్టర్ కామశాస్త్రి అన్నారు. శనివారం బోధన్‌లోని విజయసాయి విద్యాసంస్థల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. రాష్ట్రంలోనే బోధన్‌లో గల విజయసాయి విద్యాసంస్థలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇక్కడ చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ప్రస్తుతం అనేక రంగాలలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా గురువులను గౌరవించాలన్నారు. విద్య నిగూఢమైన ధనమని నేటి తరం విద్యార్థుల తమ తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. విలువలతో కూడిన విద్య ప్రాముఖ్యతను వివరించారు. విద్య కంటికి కనబడని ఆభరణం అని విద్య యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.విద్యతోనే సమగ్ర అభివృద్ధి జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయసాయి పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి, విజయసాయి కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కమిషనర్



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 30వ వార్డులో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శనివారం మున్సిపల్ కమిషనర్‌రాజు పరిశీలించారు.సరైన సమాచారం సేకరించి సర్వేను పూర్తి చేయాలని, తప్పుడు సమాచారం నమోదు చేయవద్దని సర్వే అధికారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ శేఖర్, పింజ అశోక్, బిల్‌కలెక్టర్ భాను, మున్సిపల్ అధికారులు, తదితరులు ఉన్నారు.

వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శనివారం ఎంపీవో సాయిలు, ఇతర అధికారులు పరిశీలించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే సర్వే చేసి లబ్ధిదారులను గుర్తిస్తున్నామని ఎంపీవో సాయిలు అన్నారు. ఈ సర్వే తప్పులు లేకుండా వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి కుటుంబ యాజమాని ఫోటో అప్‌లోడ్ చేయాలని, స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో మనోహర్, లింబాద్రి, ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్ సౌడ మరియా, తదితరులు ఉన్నారు.

నసురుల్లాబాద్: నసురుల్లాబాద్ మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మైలారం గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా మైలారం గ్రామ పంచాయతీ సెక్రటరీ సవిత మాట్లాడుతూ ఇంటింటికి తిరుగుతూ దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి సొంత జాగా ఉన్నవారు, అద్దెకు ఉంటున్న వారి వివరాలను మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయడం జరిగిందన్నారు. ఆమె వెంట గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

ముప్కాల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం

ముప్కాల్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలంలో పలు కార్యక్రమాలకు హాజరైన కోపరేటివ్ యనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి శనివారం ముప్కాల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దినేష్‌యాదవ్‌ను ఇటీవల నూతనంగా ఎన్నికైనందున శాలువతో ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యడుడు మగ్గిడి ముత్యంరెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందరవి, జిల్లా కమిటీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్దం సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలలో జిల్లావాసికి సిల్వర్ మెడల్



మిట్టపల్లి రిత్విక

నవీపేట,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25నుంచి 27వ తేదీ వరకు చెన్నైలో జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ నేషనల్ ఛాంపియన్ 2024-25 స్విమ్మింగ్ పోటీలలో నిజామాబాద్ జిల్లాకు చెందిన మిట్టపల్లి రిత్విక సిల్వర్ మెడల్ సాధించింది. చెన్నై ఎస్ఆర్ఎం నగర్‌లో జరిగిన స్విమ్మింగ్ పోటీలలో ఒడిశా రాజధాని భువనేశ్వర్ కలింగ యూనివర్సిటీ తరపున పాల్గొన్న మిట్టపల్లి రిత్విక 4100 మిడ్లె రిలేలో ఆలిండియా యూనివర్సిటీ స్విమ్మింగ్ పోటీలలో సిల్వర్ మెడల్ సాధించింది. మిట్టపల్లి రిత్విక నవీపేట మండలం బినోల చెందినవారు. ఆలిండియా యూనివర్సిటీ స్విమ్మింగ్ పోటీలలో నేషనల్ సిల్వర్ మెడల్ సాధించిన మిట్టపల్లి రిత్వికను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మైపాల్‌రెడ్డి, కార్యదర్శి ఉమేష్, జిల్లా అధ్యక్షుడు గడీల శ్రీరాములు అభినందించారు.

స్వగ్రామానికి చేరిన ముత్తెన్న మృతదేహం



ముత్తెన్న (ఫైల్‌ఫోటో)

ముప్కాల్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): పొట్టచేత పట్టుకొని ఉపాధి కోసం సౌదీ వెళ్లిన బొప్పారం ముత్తెన్న(56) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన ముత్తెన్న గత కొన్నేళ్లుగా బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లాడు. గత నెలలో అనారోగ్యంతో ముత్తెన్న ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ రోగ్య పరిస్థితి క్షీణించడంతో గత నెల 26న మృతి చెందాడు. 45రోజులైన మృతదేహం స్వగ్రామానికి రాకపోవడంతో, కుటుంబ పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండడంతో మృతుని కుటుంబసభ్యులు గల్ఫ్ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మృతదేహం స్వగ్రామానికి చేరేందేందుకు స్టేట్ ప్రెసిడెంట్ పోతుగంటి సాయేందర్ చొరవచూపారు.ప్రభుత్వ సహాయంతో ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేసి ముత్తెన్న మృతదేహాన్ని శనివారం ముప్కాల్ స్వగ్రామం వేంపల్లికి చేరు కుంది. మృతదేహం స్వగ్రామానికి చేరగానే కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా రోధించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం మృతుని కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని పోతు గంటి నరేందర్ డిమాండ్ చేశారు.

మిమిక్రి కళాకారుడికి ఘనసన్మానం

పెర్కిట్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మిమిక్రి దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని సావెరగ్యాస్ ఏజెన్సీ భారత్‌గ్యాస్ ఆధ్వర్యంలో శనివారం మిమిక్రి కళాకారుడు బోండ్ల ఆనంద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజర్ బి.సుమన్ పట్టుశాలువ, జ్ఞాపికతో బోండ్ల ఆనంద్‌ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో భారత్‌గ్యాస్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

30న వాహనాల వేలం

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలను ఈనెల 30న వేలం వేస్తున్నట్టు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ తెలిపారు. పలు కేసులలో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, ఎక్సైజ్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు వేలం నిర్వహిస్తున్నామని, వేలంలో పాల్గొనే వారు 25శాతం అప్‌సెట్‌ప్రైజ్ జమ చేయా లని సీఐ తెలిపారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



ఎడపల్లిలో మాజీ ప్రధానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కామారెడ్డిలో మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న చైర్మన్,సిబ్బంది

ఎడపల్లి, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి):ఎడపల్లి మండల కేంద్రంలో మాజీ ప్రధానీ మన్మోహన్ సింగ్ మృతి పట్ల శనివారం మండల కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి కొవ్వొత్తులతో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆర్బీఐ గవర్నర్‌గా, దేశఆర్థికమంత్రిగా,దేశప్రధానిగా దేశానికి సేవలు చేసి దేశ ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టాడని, దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షుడు మల్కారెడ్డి, బొబ్బిలి శ్రీనివాస్, నాయకులు బంజ కామప్ప, నాయకులు ఎల్లయ్య యాదవ్, కంచరి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఆర్మూర్‌టౌన్:మున్సిపల్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో బీజేపీ కార్యాలయంలో మాజీప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఆత్మకు శాంతి కలగాలని శనివారం బీజేపీ నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్, పట్టణ ప్రధానకార్యదర్శి పులి యుగందర్, పిర్ సింగ్‌నాయక్, కలిగోట ప్రశాంత్, ఉదయ్‌గౌడ్, దక్షణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్:కామారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం మాజీ ప్రధాని మనోహ్మన్‌సింగ్‌కు ఘన నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మనోహ్మన్‌సింగ్ భౌతికంగా దూరమైన ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు,చట్టాల రూపంలో సజీవంగానే ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మాజీ ప్రధాని ఆర్థికవేత్త ఎన్ఆర్ఈజీఎస్ నిర్మాత మన్మోహన్ సింగ్‌కు మండలంలోని ఉపాధ్యాయ సిబ్బంది శనివారం నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాజేష్, టిపిలు స్వామి, మహిపాల్, సీఏలురామస్వామి, కృష్ణ, తదితరులు ఉన్నారు.

ఫ్యాక్టరీ కార్మికుల వేతనాలు ఇప్పించాలి

● ఎమ్మెల్సీ కోదండరాంకు కార్మికుల వినతి



ఎమ్మెల్సీ కోదండ రాంకు వినతిపత్రం అందిస్తున్న బోధన్ నిజాంషుగర్స్ కార్మికులు

బోధన్‌రూరల్,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని శనివారం బోధన్ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులు ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ మజ్దూర్ సభ యూనియన్ జనరల్ సెక్రెటరీ ఉపేందర్ మాట్లాడుతూ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ లేఆఫ్ అయి 9సంవత్సరాలు అయిందని, ఇప్పటి వరకు వేతనాలు రాక కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్మికులకు రావాల్సిన వేతనాలతో పాటు గ్రాట్యూవిటీ రాని వారికి గ్రాట్యూవిటీ ఇప్పించాలని కోరారు. ప్రభుత్వం బ్యాంకర్లకు వన్ టైమ్ సెటిల్‌మెంట్‌ల కింద 200కోట్ల రూపాయలు చెల్లించిందో అదే విధంగా కార్మికులకు రావాల్సిన వేతనాలు ఇప్పించాలని ఎమ్మెల్సీకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు తదితరులున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చు



వల్లభాపూర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై

కోటగిరి,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలను అరికట్టే అవకాశం ఉందని కోటగిరి ఎస్ఐ సందీప్ పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని వల్లభాపూర్ గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన 12సీసీ కెమెరాలను ఎస్ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరాల వందమంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. సీసీ కెమెరాల వల్ల భద్రత ప్రమాణాలు పెరుగుపడతాయన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణకు, రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గ్రామంలో ప్రధాన రహదారులు, ప్రధాన కూడళ్లల్లో కెమెరాలు ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్థులను అభినందించారు. ఆయా గ్రామాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు సాయిలు, ఆంజనేయులు, లక్ష్మణ్, విఠల్ పటేల్, పంచాయతీ కార్యదర్శి అర్చన తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో నాగుపాము



నాగుపాము

రెంజల్,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం విధులు నిర్వహించేందుకు వచ్చిన సిబ్బంది ఆవరణలోని బాత్‌రూమ్‌లోకి వెళ్లిన సిబ్బందికి నాగుపాము కనిపించడంతో భయాభ్రాంతులకు గురయ్యారు. ఎంపీడీవో వెంకటేష్‌కు సిబ్బంది నాముపాము విషయమై తెలుపగా స్థానికులకు సమాచారం అందించి పాములు పట్టేవారిని పిలిపించి బాత్‌రూమ్‌లో ఉన్న నాగుపామును బయటకు పంపించి వేశారు. ఒక్కసారిగా సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. సుమారు అరగంట పాటు పాము బాత్‌రూమ్‌లోనే ఉండడంతో సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ చైర్‌పర్సన్‌కువినతి పత్రం ఇస్తున్న నాయకులు

కామారెడ్డిటౌన్,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ కార్మికుల పెండింగ్ జీతాలు, సమస్యలు తీర్చాలని మున్సిపల్ కార్మికులు శనివారం చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియచంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందిం చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కార్మికుల అకౌంట్‌లలో జమచేయాలని మున్సిపల్ కార్మికులకు కేటగిరి వారిగా పెరిగిన జీతాలు అందించాలని తెలిపారు. అలాగే వచ్చే నెల 4,5 మున్సిపల్ కార్యాలయం వద్ద,6న కలెక్టర్ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమాలు ఉంటాయని ఒకవేళ పరిష్కారం చూపకపోతే 27న సమ్మెకు వెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాజనర్సు ప్రభాకర్,ప్రభు,దీపక్, శివరాజవ్వ,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: గ్రామ పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని జేఏసీ నాయకులు నన్నేసాబ్ డిమాండ్ చేశారు. రుద్రూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం గ్రామ పంచాయతీ కార్మికులు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నన్నేసాబ్ మాట్లాడుతూ జీవో నెంబర్ 60ప్రకారం పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు నర్సింలు, వహీద్,సాయిలు, శంకర్, గంగారాం, సాయవ్వ, లింగవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు నాయకులు జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. ఎడపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం గ్రామ పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జంగం గంగాధర్ మాట్లాడుతూ జీవో నెంబర్ 60ప్రకారం పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు సంతోష్, శ్రీనివాస్, స్వామి, నాగరాజు, మహేష్, అనిత, గంగవ్వ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ఏర్గట్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోంచంద గ్రామంలో శనివారం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి నవ్యకు రూ.60 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరు కాగా కాంగ్రెస్ నాయకులు అట్టి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరుకి కృషి చేసిన రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ పెద్దిరెడ్డి రవి, వెంకట్ రెడ్డి, పెద్దిరెడ్డి లింగారెడ్డి,నరేష్, ప్రకాష్, ఎర్ర ముత్తెన్న, చిన్నభూమయ్యలు పాల్గొన్నారు.

ముగ్గురు ఆత్మహత్యలపై సీన్ రీ కన్‌స్ట్రక్షన్

● ఆత్మహత్యలపై కొనసాగుతున్న ఉన్న మిస్టరీ



చెరువు వద్ద పోలీసు బృందం

కామారెడ్డి,డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):కామారెడ్డిలో ఎస్ఐ సాయికుమార్,మహిళ కానిస్టేబుల్ శృతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్‌ల మూకుమ్మడి ఆత్మహత్యలపై మిస్టరీ వీడడం లేదు. వీరు ముగ్గురు ఏ కారణం చేత ఆత్మహత్యకు పాల్పడ్డారనే దానిపై సస్పెన్స్ కొనసాగుతునే ఉంది. మరోవైపు పోలీసులు సైతం ఈ కేసును సీరియస్‌గా తీసుకుని వేగంగానే విచారణ చేపడుతున్నారు. మృతుల ఫోన్‌కాల్స్,వాట్సాప్ చాటింగ్ ద్వారా పోలీసులకు ప్రాథమికంగా లభ్యమైన కీలక అంశాల ఆధారంగా శనివారం ఆత్మహత్యలపై సీన్ రికన్‌స్ట్రక్షన్ చేశారు. దర్యాప్తు బృందం ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థలమైన అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద పరిశీలించారు. చెరువు వద్దకు ఎస్ఐ,కానిస్టేబుల్ కంప్యూటర్ ఆపరేటర్ ఏ సమయంలో చేరుకున్నారు... వీరి మధ్య అక్కడ ఏం జరిగింది...మొదట చెరువులో ఎవరు దూకారు...అనేదానిపై సీన్ రికన్‌స్ట్రక్షన్ చేశారు. అదేవిధంగా చెరువులోని నీటి శాంపిల్‌లను సేకరించారు.అనంతరం బీబీపేట, భిక్కనూరు పోలీసుస్టేషన్‌కు దర్యాప్తు బృందా లు వెళ్లి అక్కడ సైతం సీన్ రికన్‌స్ట్రక్షన్ చేసినట్లు తెలిసింది. స్థానిక పోలీసుస్టేషన్‌లోని సిబ్బందిని సైతం దర్యాప్తు బృందం విచారించింది.ఈ దర్యాప్తులో పలు కీలక అంశాలు పోలీసులకు చిక్కినట్లు తెలుస్తోంది. ఈనెల 25న సుమారు ఉదయం 11.45 నిమిషాలకు ఎస్ఐ సాయికుమార్ తన స్వంత కారులో భిక్కనూరు టోల్‌గేట్ నుంచి కామారెడ్డి వైపు వస్తున్నట్లు గుర్తించారు. ఆసమయంలో కారులో ఎస్ఐ ఒక్కరే ఉన్నారు. జంగంపల్లి ఓదాబా వద్ద కారు ఎస్ఐ ఆపారు.అదేప్రాం తంలో కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్‌బైక్ సైతం నిలిపి ఉన్నట్లు పోలీసులు గు ర్తించారు. వీరిద్దరు కలిసి కారులో కామారెడ్డి బస్టాండ్‌కు వెళ్లగా అక్కడ కానిస్టేబుల్ శృతిని తీసుకెళ్లినట్లు తెలుస్తుంది.ఈసంఘటనలన్ని బస్టాం డ్ సమీపంలో ఉన్న సీసీకెమెరాలో రికార్డు దృశ్యాలను పోలీసు లు సేకరించారు.సుమారు సాయంత్రం 4గంటల సమయంలో వీరు అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువుకు చేరుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

● ఆత్మహత్యపై శృతి, నిఖిల్ ముందుగానే వాట్సాప్‌లో చాటింగ్...?

మూకుమ్మడి ఆత్మహత్యలపై ఆధారాలను పోలీసులు ఒక్కొక్కటిగా సేకరిస్తున్నట్లు తెలుస్తుంది. మృతుల ఫోన్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని ఐటీ నిపుణుల సహాయంతో ఓపెన్ చేశారు. ప్రధానంగా ముగ్గురు మృతుల కాల్‌డేటాను సేకరించారు. వీరి కాల్స్ సంభాషణను దర్యాప్తు బృందం పరిశీలించినట్లు తెలిసింది. గత కొన్నిరోజులుగా శృతి, నిఖిల్ ఫోన్‌లో గంటల కొద్ది మాట్లాడే క్రమంలో విభేదాలుతలెత్తినట్లు తెలుస్తుంది. అదేవిధంగా వీరి వాట్సాప్ ఛాటింగ్‌లోను కీలక అంశం బయటపడినట్లు సమాచారం. ఆత్మహత్యపై శృతి,నిఖిల్ ముందుగానే ఫోన్‌లో వాట్సాప్ ఛాటింగ్‌లో చేసినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తుంది. వీరి ఆత్మహత్యలకు ప్రేమ,పెళ్లి ప్రధానకారణమని ఫోన్ కాల్స్, వాట్సాప్ ఛాటింగ్ ద్వారా పోలీసులు ఓ నిర్ధారణకు వచ్చా రు. ఆత్మహత్యకు ముందే శృతి,నిఖిల్ ఓ ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది. ఇందులో ఎస్ఐను కూడా వీరు లాగినట్లు ప్రచారం సాగుతుం ది. సుసైడ్ ప్లానింగ్‌లో భాగంగా వాట్సాప్ చాటింగ్‌లో ఎస్ఐ సాయికుమార్‌ను వీరిద్దరు నమ్మించి తప్పుదోవ పట్టించి ఉండవచ్చని పోలీసులు సైతం భావిస్తున్నారు. అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద కారులో వీరు ముగ్గురు మాట్లాడుతుండగానే నిఖిల్, శృతిలు చెరువు గట్టువైపు వెళ్లారు. వీరిద్దరు సెల్‌ఫోన్‌లు అక్కడే పెట్టి చెరువులో దూకినట్లు తెలుస్తుంది. దీనిని గమనించిన ఎస్ఐ వారిని కాపాడే ప్రయత్నంలో ఆలోచించకుండా చెరువులో దూకినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకువచ్చినట్లు తెలుస్తుంది. అయితే వీరు దూకిన చెరువు ప్రాంతం వద్ద 15 మీటర్లలోతు వరకు ఉండడం, పిచ్చిమొక్కలు,నాచు తీగల్లో ఇరుకపోయి ఊపిరిఆడక మృతిచెంది ఉండవచ్చని పోలీసులుభావిస్తున్నారు. ఓ పోలీసు అధికారి సైతం ప్రేమ వ్యవహారం ఆత్మహత్యకు దారి తీసిందని చెప్పుకురావడం గమనార్హం. ఆత్మ హత్యపై పోలీసులు ని ఖిల్ స్నేహితులను సైతం ఆరాతీశారు. నిఖిల్ వారి స్నేహితులతో ఎప్పుడైన శృతితో ఉన్న ప్రేమ వ్యవహారం, ఎస్ఐతో ఉన్న సంబంధాలపై చర్చించాడా అనే దానిపైన పోలీసులు విచారణచేపడుతున్నారు. తాజాగా దర్యాప్తు బృందం నిఖిల్ స్నేహితులను కలిసి ఆత్మహత్యలపై గల కారణాలను తెలుసుకునే ప్రయత్నాలుచేశారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే వేముల



పాలెంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేముల

మోర్తాడ్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి):మోర్తాడ్ మండలంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని శనివారం పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. మండలంలోని పాలెంకు చెందిన రవియాదవ్ తండ్రి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని, అలాగే మోర్తాడ్‌లో ఎస్సీవాడకు చెందిన రిష్విత్ ఇటీవల భిక్కనూర్ గురుకుల కాలేజీలో చదువుతూ ప్రమాదవశాత్తు కాలేజీ భవనంపై నుంచి పడి రెండు కాళ్లు విరగడంతో వారిని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కలెక్టర్, డీఎంఅండ్ హెచ్‌వో అధికారులతో మాట్లాడి బాలుకు కావాల్సిన ఏర్పాట్లను దగ్గరుండి చూసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. దొన్‌పాల్ గ్రామానికి చెందిన సొసైటీ డైరె క్టర్ ముత్యాల లక్ష్మణ్ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మోర్తాడ్ సొసైటీ చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలంలోని పలు గ్రామాలలో బాదిత కుటుంబాలను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. కిడ్నీ సంబందిత వ్యాధితో బాధపడుతున్న బషీరాబాద్ గ్రామ మాజీసర్పంచ్ సక్కరం అశోక్‌ను ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకుని ధైర్యం చెప్పారు ఆయనతోపాటు మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, బైకాని మహేష్, గోపిడి లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ పిప్పెర అనిల్, రాజనందం ఉన్నారు. అనంతరం చౌట్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకుడు నందును, అమీర్‌నగర్‌లో పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మల గం గారాం, పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ జడ్పీటీసీ దాసరి భాస్కర్ యాదవ్ చిన్నాన్న దాసరి చిన్న బాలయ్య, పెద్ద నాన్న దాసరి పెద్ద గంగారాం మరణంతో వారి కుటుంబాలను పరామర్శించారు. కోనాసమందర్‌కు చెందిన బలేరావు సంతోష్‌ను కమ్మర్‌పల్లికి చెందిన సుంకరి మురళిని, ఒక దినపత్రిక విలేకరి బోడ్డు శంకర్‌ను ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. ఆయనతో పాటు పార్టీ కార్యకర్తలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

రైతులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలి

● ట్రాన్స్‌కో డీఈ రమేష్



శ్రీనగర్ శివారులో పొలంబాట దృశ్యం

వర్ని,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట పొలాల వద్ద విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా చూడాలని ట్రాన్స్‌కో డీఈ రమేష్ సూచించారు. శనివారం శ్రీనగర్ గ్రామ శివారులో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. పొలాల మధ్య ఉన్న మోటార్లు, స్టాటర్లు, పీవీసీ పైపులు ఐఎస్ఐ నాణ్యతతో ఉండేలా చూసుకోవాలని ప్రతి విద్యుత్ వస్తువు తప్పనిసరి ఎర్తింగ్ చేయాలని సూచించారు. లో ఓల్టేజీ సమస్య రాకుండా విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలని కోరారు. విద్యుత్ ప్రమాదకరం కావున సమస్యలు ఉంటే సిబ్బందికి తెలపాలని కోరారు.ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూస్‌లను రైతులు మార్చవద్దని సూచించారు. 1912విద్యుత్ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాస్, ఏఈ బాలకిషన్, సబ్ ఇంజనీర్ వేణుగోపాల్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపూర్ మూల మలుపు 44వ జాతీయరహదారిపై రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఇస్సాపల్లి గ్రామానికి చెందిన ఇట్టెం శ్రీధర్ ఆర్మూర్‌లో మెకానిక్ షాప్‌లో పని చేస్తాడు. తనకు ముప్కాల్ మండల కేంద్రంలో పని ఉండడంతో వన్నెల్‌దాస్ గంగారాంను తన ద్విచక్రవాహనంపై తీసుకొని పనులు ముగించుకొని వస్తుండగా చేపూర్ గ్రామం నుంచి జాతీయరహదారిపైకి రాజేశ్వర్ తన ద్విచక్ర వాహనంపై అతిజాగ్రత్తగా అధిక స్పీడ్‌తో వచ్చి శ్రీధర్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో గంగారాంకు తలకు, చేతులకు తీవ్రగాయాలు కాగా, శ్రీధర్‌కు స్వల్పగాయాల య్యాయి. సంఘటన స్థలాన్ని ఎస్సై మహేష్ పరిశీలించి బాధితులను 108అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

చెరకు లారీ బోల్తా..

కోటగిరి,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కల్లూర్ సమీపంలో శుక్రవారం రాత్రి చెరకు లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. మహరాష్ట్రలోని తమ్లూర్ నుంచి చెరకు లోడ్‌తో నిజాంసాగర్‌లోని మాగి చెరకు ఫ్యాక్టరీకి వెళ్తుంది. కల్లూర్ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం



షార్టు సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

ఎడపల్లి, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి):మండలంలోని జానకంపేట గ్రామంలో శనివారం జరిగిన షార్టుసర్క్యూట్ వల్ల పెంకుటిల్లు దగ్ధం అయి నట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన న్యాకపు నర్సయ్య, లక్ష్మి, గొంగలి గంగాధర్‌లకు చెందిన చుట్టుబంతి పెంకుటిల్లు విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో దగ్ధం అయింది. ఇది గమనించిన స్థానికులు ఫైర్ ఇంజన్ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ సంఘటనలో కుటుంబీకుల పిల్లలకు చెందిన చదువు సర్టిఫికెట్లు, నగదు, కాలిపోయినట్లు వారు తెలిపారు.

పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలి

● నేర నియంత్రణకు కఠినంగా వ్యవహరించాలి : బోధన్ ఏసీపీ



బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏసీపీ

బోధన్‌రూరల్,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలని, నేర నియంత్రణకు కఠినంగా వ్యవహరించాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా బోధన్ రూరల్ సీఐ కార్యాలయంతో పాటు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు రక్షణ కల్పించాలని వచ్చే బాధితులకు తగిన గౌరవం ఇస్తూ వారి సమస్యలను సవాదానంగా అలకించి మేమున్నామని భరోసా నింపుతూ పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. రౌడీ షీటర్లపై నిఘా ఏర్పాటు చేసి వారి కదిలికలను పసి కట్టాలన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు ఉపక్రమించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.



మోర్తాడ్‌లో ఇళ్ల నిర్మాణం కోసం సగం ధరకే సరఫరా చేస్తున్న ఇసుక

ఇసుక ధర తగ్గడంతో పెరిగిన ఇళ్ల నిర్మాణాలు

- సగానికి ధర తగ్గించిన ఇసుక వ్యాపారులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఇళ్ల నిర్మాణ దారులు

మోర్తాడ్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ మండల పరిసర ప్రాంతాల్లో గృహ నిర్మాణదారులు తమ ఇళ్ల నిర్మాణానికి తక్కువ ధరకే ఇసుక లభించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పాయింట్ పెద్దవాగు నుంచి ట్రాక్టర్‌కు ఐదు వేలు పెట్టి కొనుగోలు చేసిన నిర్మాణ దారులు ప్రస్తుతం మోర్తాడ్, గాండ్లపేట్, శెట్‌పల్లి, తదితర పెద్దవాగు శివారులో గ్రామాల నుంచి రూ.2500లకే ట్రాక్టరు ఇసుక సరఫరా అవుతున్నందున నిర్మాణదారులకు ఖర్చు బాగా తగ్గుతుందని అంటున్నారు. పెద్దవాగు నుంచి ఇసుక తరలించడానికి అధికారులు అనుమతులు ఇవ్వకపోయిన, గ్రామాభివృద్ధి కమిటీలు వేలం పాటలు నిర్వహించి చౌకగా ఇసుక పొందడానికి సహకరిస్తున్నాయి. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పెద్దవాగు శివారు గ్రామాలకు చెందిన గ్రామ కమిటీలతో ఇసుక వ్యాపారులు ఎలాంటి ఒప్పందాలు చేసుకున్నా ఇళ్లు నిర్మించుకునే వారికి తక్కువ ధరకే ఇసుక సరఫరా చేయాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ ఆదేశాలతో ఇసుక ధర సగానికి సగం తగ్గిపోయింది. సుంకెట్ పెద్దవాగు నుంచి సరఫరా అయ్యే ఇసుకకు గ్రామకమిటీ అధికారులు ఇసుక వ్యాపారులు వసూళ్లు చేయడంతో ట్రాక్టరు ట్రిప్పుకు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు అమ్మకాలు జరిగేవి. దీంతో ఇళ్లు నిర్మించుకునే వారికి ఖర్చు ఎక్కువ అయ్యేది. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణదారులకు ఉచితంగా ఇసుక అందివ్వాలనే నిర్ణయం పట్ల కూడా ప్రజలు హర్షిస్తున్నారు. సునీల్‌కుమార్ చొరవ వల్ల బాల్కొండ నియోజకవర్గంలో గృహ నిర్మాణదారులు మాత్రం ఎంతో సంతోషంగా ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పెరిగాయి..



● హడ్వాల మనోజ్, శెట్‌పల్లి

ఇసుక ధర బాగా తగ్గడంతో మోర్తాడ్‌లో ఇళ్ల నిర్మాణాలు పెరిగాయి. మొన్నటి వరకు అధిక మొత్తానికి ఖరీదు చేసిన నిర్మాణ దారులు తక్కువ ధరకే ఇంటి ముందుకు సరఫరా కావడంతో సంతోష పడుతున్నారు. గ్రామాల్లో కూడా గృహ నిర్మాణాలు పెరిగాయి.

ఎల్లారెడ్డి కాంగ్రెస్‌లోకి వలసల జోరు



తాడ్వాయి మాజీ జడ్పీటీసీ గంగాధర్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో చేరికలు
- స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు నాయకులు

నాగిరెడ్డిపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి వలసల జోరు కొనసాగుతోంది. దీంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింతగా పుంజుకొంటోంది. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నేతలు, బీజేపీ నేతలు ఆ పార్టీలకు గుడ్ బై చెబుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి చేరుతున్నారు. వివిధ పార్టీలకు చెందిన మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు, సొసైటీ డైరెక్టర్లు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి చేరడంతో కాంగ్రెస్‌కు మరింత బలం చేకూరుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో నియోజకవర్గంలోని బీఆర్ఎస్, బీజేపీల నేతలు ఒక్కొక్కరుగా ఆయా పార్టీలకు గుడ్ బై చెబుతూ ఎమ్మెల్యే మదన్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్నారు.

● కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న పలువురు నేతలు

ఎల్లారెడ్డి నియోజకవర్గం లోని బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన పలువురు నేతలు ఇటీవల నాలుగైదు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాడ్వాయి మండల మాజీ జడ్పీటీసీ సుంకరి గంగాధర్ ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రామారెడ్డి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ గౌడ్ బీఆర్ఎస్‌ను వీడి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే నాగిరెడ్డిపేట మండలానికి చెందిన పోచారం గ్రామ మాజీ సర్పంచ్ నర్సాగౌడ్, లింగంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కిష్టయ్య, చీనూరు గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ డైరెక్టర్ నారాగౌడ్, బెజుగం చెరువు తండాకు చెందిన పీఎసీఎస్ డైరెక్టర్ కిషన్ నాయక్‌లతో పాటు ఆత్మకూర్, వాడీ, ఎర్రారం, పోచారం, లింగంపల్లి, చీనూర్ తదితర గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీలకు గుడ్ బై చెప్పి, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న రెండు లక్షల రూపాయల రైతుల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మీ పథకం ద్వారా రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్న వడ్లకు రూ.500 బోనస్, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు లాంటి వివిధ సంక్షేమ పథకాలకు తాము ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ఇతర పార్టీల నాయకులు ఆయా పార్టీలను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలం రోజు రోజుకు మరింతగా పుంజుకొంటుంది. దీంతో బీఆర్ఎస్, బీజేపీలకు గట్టి షాక్ తగులుతోందని పలువురు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.



కాంగ్రెస్‌లో చేరిన నాగిరెడ్డిపేటకు చెందిన ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు

విద్యాశాఖలో సేవలకు బ్రేక్!

- 23 రోజులుగా సమ్మెలో సమగ్ర శిక్షా ఉద్యోగులు
- నిలిచిన ఆన్‌లైన్ సేవలు
- ప్రభుత్వం స్పందించేనా?



సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్షా ఉద్యోగులు (ఫైల్)

బాన్సువాడ టౌన్ , డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె బాట పట్టడంతో విద్యాశాఖలో సేవలకు బ్రేక్ పడినట్లైంది. రోజుకో తీరున నిరసనలు తెలుపుతూ తమ సమ్మెను కొనసాగిస్తున్నారు. ఎంఆర్సీ, సీఆర్సీ, పాఠశాల, కేజీబీవీ, యూఆర్ఎస్, మోడల్ స్కూల్ విభాగాల ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను సీఎం హోదాలో మర్చిపోయారా అని సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. గత 23 రోజులుగా వారి సమ్మె కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే రోజుల్లో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

నిలిచిన ఆన్‌లైన్ సేవలు..

సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేపట్టడంతో విద్యాశాఖలో పలు రకాల ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. పీఎం పోషణ, ట్రెజరీ, మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, ఎంఈవో కార్యాలయాల్లో డాటా ఎంట్రీ పనులకు బ్రేక్ పడినట్లైంది. అంతేకాకుండా మధ్యాహ్న భోజన పథకంలో వంటలు చేసే వారి బిల్లులు పడక నానా అవస్థలు పడుతున్నారు.

ఇవీ డిమాండ్‌లు ..

- సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలి.
- అప్పటి వరకు పే స్కేల్‌ను అమలు చేయాలి.
- ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.20లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలి.
- ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ కింద 25లక్షలు అందజేయాలి.
- ప్రభుత్వ విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలి. ఒకవైపు ఉద్యోగులు సమ్మె కొనసాగిస్తుండడం , మరో వైపు ప్రభుత్వం స్పందించకపోవడంతో విద్యాశాఖలో చాలా మట్టుకు పనులు నిలిచిపోయాయి. దీంతో సమయానికి కావాల్సిన పనులు కావడం లేదు. కేజీబీవీ, భవిత కేంద్రాల్లో బోధన లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా అడుగులు వేయాలని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

పనులు సజావుగా సాగడం లేదు..

● నాగేశ్వరరావు, ఎంఈవో, బాన్సువాడ

సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె బాట పట్టడంతో పలు రకాల పనులు సజావుగా సాగడం లేదు. ఎంఈవో కార్యాలయాల్లో చేయాల్సిన ఆన్‌లైన్ సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. దీంతో సమగ్రమైన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు.

బాపూజీ వచనాలయంపై దుష్ప్రచారం చేయడం తగదు

● బాపూజీ వచనాలయ అధ్యక్షుడు భక్తవత్సలం



మాట్లాడుతున్న బాపూజీ వచనాలయ అధ్యక్షుడు భక్తవత్సలం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల చరిత్ర కలిగిన బాపూజీ వచనాలయంపై కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారని బాపూజీ వచనాలయ చైర్మన్ భక్తవత్సలం (ఢిల్లీ) అన్నారు. శనివారం బాపూజీ వచనాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఎంతో చరిత్ర కలిగిన బాపూజీ వచనాలయాన్ని డిజిటల్ లైబ్రెరీగా తీర్చిదిద్దడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. కొంత మంది స్వలాభం కోసం దురుద్దేశ్యంతో ఈ వచనాలయంపై, తనపై నిరాధారణ ఆరోపణలు చేస్తూ కోర్టులో కేసులు వేస్తూ ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు అందించిన ఈ లైబ్రరీపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. బాపూజీ వచనాలయం కమిటీ నుంచి ఒక్క రూపాయి వాడుకున్న ఆధారాలతో బయటపెడితే అందుకు తాము దేనికైనా సిద్ధంగా ఉన్నామని అవసరమైతే చైర్మన్ పదవికి రాజీనామా చేస్తానన్నారు. గత నెలలో జరిగిన ఎన్నికల్లో రెండు ప్యానల్‌లు పోటీ పడ్డాయని తమ ప్యానల్‌లో 19 మంది పోటీ చేయగా తాము చేసిన అభివృద్ధిని చూసి తమ ప్యానల్‌ను గెలిపించారని ఆయన అన్నారు. గత ఐదు సంవత్సరాల క్రితం బాపూజీ వచనాలయం సభ్యులు భవనం శిథిలావస్థకు చేరిందని పిల్లలు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని దీన్ని అభివృద్ధి చేయాలని ఎన్నికల్లో పోటీ చేయాలని సూచిస్తే తాను పోటీ చేసి తనతో పాటు 14 మంది గెలుపొందారని అన్నారు. ఆ సమయంలో బాపూజీ వచనాలయాన్ని డిజిటల్ లైబ్రెరీగా మారుస్తామని హామీ ఇచ్చామని కరోనా వల్ల రెండు సంవత్సరాలు లైబ్రెరీకి అద్దె వసూలు కాలేదని ఇప్పుడు ప్రజాప్రతినిధులు, ఇతరుల సహకారంతో నూతన భవనాన్ని నిర్మాణం చేస్తున్నామని ఆయన తెలిపారు. అద్దె పెంచడం జరిగిందని దాదాపు 80లక్షల వరకు జమ చేశామని తమవద్ద ఉన్న 80లక్షలతో భవన నిర్మాణం ప్రారంభించామని శిథిలావస్థకు చేరిన 22 మడిగెలను అద్దె సరిగ్గా రావడం లేదని వాటిని పడగొట్టి నూతన నిర్మాణం చేపట్టామన్నారు. బాపూజీ వచనాలయానికి ఎంతో చరిత్ర ఉందని దీని అభివృద్ధికి సహకరించాలే తప్ప స్వలాభం కోసం దాని ప్రతిష్టను దిగజార్చవద్దని కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి మీసాల సుధాకర్‌రావు, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచుకోని నీటి శుద్ధి యంత్రం

- నీటిని కొనుగోలు చేసి తాగుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



కేజీబీవీలో పనిచేయని నీటిశుద్ధి యంత్రం

సిరికొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు శుద్ధమైన మంచి నీటిని అందించడానికి ఏర్పాటు చేసిన నీటిని శుద్ధి చేసే యంత్రం ఐదేళ్లుగా పనిచేయక పోయిన మరమ్మతు చేయించాలనే ధ్యాసే కలుగక పోవడం బాధాకరమని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయ పడుతున్నారు. మండలంలోని అన్నపూర్ణేశ్వరీ కాల నీలో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆరేళ్ల క్రితం ఏర్పాటు చేసిన నీటీ శుద్ధి యంత్రం ఆరు నెలలు, ఏడాది కాలం మాత్రమే పని చేసిందని సమాచారం. యంత్రం పాడై పోయి ఐదేళ్లు గడిచినా మరమ్మతు చేయించి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యాన్ని అధికారులు మరిచి పోవడం బాధాకరం. నీటి శుద్ధి యంత్రం పనిచేయడం మానివేసిన నాటి నుంచి విద్యార్థులకు తాగడానికి ప్యూరీ ఫైడ్ నీటిని కొనుగోలు చేస్తున్నట్లు ప్రత్యేక అధికారి పర్వీన్ బేగం తెలిపారు. ఐదేళ్ల నుంచి నీటిని కొనుగోలు చేస్తున్నారు. నీటి శుద్ధి యంత్రం పనిచేయదని తెలిసినా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నీటి శుద్ధి యంత్రం పనిచేయడం లేదని తెలిసిన విద్యాశాఖ అధికారులు గాని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు గాని పట్టించుకున్న పాపాన పోలేదు. విద్యార్థులకు మంచి నీటిని అందించడంలో విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అధికారులకు లేకపోయిన ప్రజాప్రతినిధులు గిరిజన బాలికలంటే ఇంత నిర్లక్ష్యం చూపించడమేమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్లు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు సైతం గిరిజన తెగకు చెందిన వారున్నా ఎవరు నీటి శుద్ధి యంత్రాన్ని బాగు చేయించడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నీటి శుద్ధి యంత్రాన్ని బాగు చేయించాలి

ప్రభుత్వం మారిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పాడై పోయిన నీటీ శుద్ధి యంత్రాన్ని విద్యా శాఖ ఉన్నాతాధికాలు స్పందించి బాగు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి స్పందించి నీటి శుద్ధి యంత్రాన్ని మరమ్మతు చేయించి స్వచ్ఛమైన నీటిని అందించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

అయ్యప్ప దీక్షతో మానసిక ప్రశాంతత



గ్రామీణ ప్రాంతాలలో పడిపూజకు హాజరైన అయ్యప్ప స్వాములు



భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజలో స్వాములు

మద్నూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్షతో మానసిక ప్రశాంతత పొందవచ్చునని, తద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చంటూ ఎంతోమంది ఆధ్యాత్మికవేత్తలు పండితులు చెబుతుంటారు. ఆధ్యాత్మికతలో భాగమైన ధ్యానం లాంటివి చేయడం ద్వారా కొన్నిసార్లు వైద్యంతో కూడా నయంకాని రుగ్మతల నుంచి ఉపశమనం దొరుకుతుందని, అందరికీ తెలిసింది. ముఖ్యంగా హిందువులు ఎంతో పవిత్రంగా భావించే శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసం నుంచి సంక్రాంతి పర్వదినం వరకు అయ్యప్ప దీక్షలను స్వీకరిస్తుంటారు. ఈ సమయంలో 41 రోజులపాటు నియమాలతో కూడిన దీక్షను పాటిస్తారు. ఈ దీక్షలో క్రమ శిక్షణతో పాటు ఆహారం తీసుకునే క్రమంలో పాటించే పద్ధతులలో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని చెబుతారు. ఈ క్రమంలో జిల్లాల్లో అయ్యప్ప మాలలు ధరించే వారి సంఖ్య ఏటేటా పెరుగుతుంది. ఈ ఏడాది కూడా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు వైభవంగా పడిపూజల కార్యక్రమాలతో సందడిగా కనిపిస్తుంది. కార్తీకమాసం ప్రారంభం నుంచే అయ్యప్ప దీక్ష తీసుకునే స్వాములు రెండు పూజల్లో పాల్గొంటారు. శబరిమలలో జరిగే మండల పూజకు కొంత మంది స్వాములు హాజరయ్యేలా మాలధారణ చేస్తారు. మరికొంత మంది స్వాములు జనవరిలో సంక్రాంతి రోజున మకర జ్యోతి దర్శనానికి వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. సంక్రాంతి పండుగ రోజున అయ్యప్ప జ్యోతి రూపంలో దర్శనం ఇచ్చే రోజున స్వాములు ఎంతో భక్తిశ్రద్ధలతో శబరిమల సన్నిధానంలో వేచి చూస్తారు. ఇలా దీక్షలు తీసుకొని వారి సంఖ్య జిల్లాలో ఏటేటా పెరుగుతుంది 41 రోజుల పాటు నియమాలతో కూడిన దీక్షను పాటించే స్వాములు క్రమశిక్షణ ఆహారం విషయంలోనే కాకుండా వారి నడవడికలో మార్పు వస్తుంది. ఇందులో ఆధ్యాత్మికతకు తోడు ఆరోగ్య, మానసిక అంశాలు ఇమిడి ఉన్నాయని నమ్మితారు. తెల్లవారు జామున చన్నీటి స్నానం వల్ల శరీరంలో ఉష్ణోగ్రతల క్రమబద్ధీకరణ జరుగుతుందని శరీరంపై ఒత్తిడి తగ్గుతుందని. ఒక పూట భోజనం వల్ల ప్రోటీన్లు, విటమిన్లు, పీచు పదార్థాలను శరీరం చక్కగా వినియోగించుకుంటుందని చెబుతారు. గ్యాస్, ఊబకాయం లాంటి ఇబ్బందులు నియంత్రణలో ఉంటాయని. నేలపై నిద్రించడం వల్ల నాడీ రక్తప్రసరణ వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తాయని, శారీరక నొప్పులు తగ్గుతాయంటారు, కాళ్లకు చెప్పులు వేసు కోకపోవడం వల్ల పాదాలు నేలను తాకుతూ ఆ ఒత్తిడితో రక్త ప్రసరణ సక్రమంగా సాగుతుందంట. ఇలా అయ్యప్ప దీక్ష తీసుకున్న స్వాములకు ఆధ్యాత్మికతో పాటు ఆరోగ్యం బాగుంటుందని పలువురు స్వాములు భావిస్తుంటారు.

● కఠినమైన దీక్షతో ఎంతో మార్పు వస్తుంది

18 సార్లు అయ్యప్ప దీక్ష తీసుకున్నాను. ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రతీయేటా మాల వేయాలని నిర్ణయించుకొని 18 సార్లు వేశానని. ఎంతో కష్టమైన ఈ దీక్షతో మనలో ఎన్నో మార్పులు వస్తాయి. ఆధ్యాత్మికతను ఆరోగ్యాన్ని వేరు వేరు చూడలేం. దీక్ష చేపట్టిన తర్వాత గురుస్వాములు ఆధ్యాత్మిక వేత్తలు చెబుతుంటే ఆరోగ్యానికి ఈ దీక్ష ఎంత మేలు చేస్తుందో అర్థమైంది. పలు రుగ్మతల నుంచి ఉపశమనం పొందిన స్వాములు ఎంతోమంది ఉన్నారు.

- చౌలా హనుమాండ్లు స్వామి

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

- వృథాగా పడి ఉన్న క్రీడా పరికరాలు.. ● పట్టించుకోని అధికారులు

కోటగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యువతకు క్రీడలపై ఆసక్తి పెంచే విధంగా గత ప్రభుత్వం గ్రామాలలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. క్రీడ ప్రాంగణాలను పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. పలు గ్రామాలలో క్రీడ ప్రాంగణాల ఏర్పాటుకు సరైన ప్రభుత్వ స్థలాలు లేక ఉన్న స్థలాల్లోనే ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. గ్రామానికి దూరంగా ఉండడంతో అటు వైపు ఎవరు వెళ్లి పరిస్థితి లేకుండా పోయింది. అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగా లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన క్రీడ ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. కొన్ని చోట్ల క్రీడ పరికరాలు ఏర్పాటు చేసిన పర్యవేక్షణ లేకపోవడం మరి కొన్ని చోట్ల నామ మాత్రంగా ప్రాంగణం బోర్డులు ఏర్పాటు చేసి మమ అనిపించారు. దీంతో క్రీడాకారులు ఆటలకు దూరమవుతున్నారు. దీంతో కోటగిరి ఉమ్మడి మండలంలో 28 గ్రామ పంచాయతీలకు గాను గత ప్రభుత్వం 16 గ్రామాల లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. కొన్ని చోట్ల అనువైన స్థలాలు ఉండగా మరి కొన్ని చోట్ల సరిపడ స్థలాలు లేక కేవలం బోర్డులను మాత్రమే ఏర్పాటు చేశారు. చాలా చోట్ల పరికరాలు కూడా లేవు. కొన్ని ఊరికి దూరంగా ఉన్నాయి. దీంతో సెలవు దినాల్లో ఆటలు ఆడేందుకు చిన్నారులు, యువకులకు ఆసక్తి ఉన్న మైదానాలు లేక ఆటలు ఆడడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం క్రీడాలకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న క్షేత్రస్థాయిలో మాత్రం పూర్తిగా భిన్న పరిస్థితులు నెలకొన్నాయి.



హెగ్డోలి క్రీడా ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలు



చేతన్‌నగర్‌లో అలంకార ప్రాయంగా క్రీడా ప్రాంగణం



వృథాగా మారిన వ్యాయామ పరికరాలు

● సెల్‌ఫోన్‌లతో కాలక్షేపం

గ్రామాలలో మైదానాలు లేక చాలా మంది చిన్నారులు, విద్యార్థులు సెల్‌ఫోన్‌లతో కాలక్షేపం చేస్తున్నారు. స్నేహితులు గుంపులుగా చేరి ఆన్‌లైన్ ఆటలు ఆడుతున్నారు. ఓ వైపు రీల్స్ చేస్తూ మరో వైపు ఒకే చోట గంటల తరబడి కూర్చోవడంతో శారీరకంగా దృఢత్వం కోల్పోతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్‌లో చిన్నారులకు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. శారీరకంగా చేసే పనులు సైతం చేయలేకపోతున్నారని పలువురు వైద్య నిపుణులు సైతం హెచ్చరిస్తున్నారు.

● ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధన

మైదానాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు ఆటలు ఆడుతున్నారు. కొందరు వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని క్రీడలపై ఆసక్తి కలిగిలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ప్రతీరోజు వీరితో సాధన చేయించి క్రీడా పోటీలకు తీసుకెళ్తున్నారు. ఆసక్తి ఉన్న వారు ఆయా పోటీల్లో రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారు. గ్రామాల్లో మైదానాలు ఉంటే క్రీడాకారులు సాధన చేసుకునే వీలు ఉంటుంది.

● క్రీడా ప్రాంగణాల్లో కనీస వసతులు కరువు

గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిర్వహణ లేక ఉపయోగంలోకి రావడం లేదు. గత ప్రభుత్వ హయంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిన క్రీడ పరికరాలు ఏర్పాటు చేయలేదు. వాలీబాల్, ఖోఖో ఆటలకు సంబంధించి కోర్టులు ఏర్పాటు చేయలేదు. పరికరాలను సైతం అమర్చకుండా వదిలేశారు. క్రీడా ప్రాంగణాల ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పేరుకు మాత్రమే క్రీడా ప్రాంగణం అనే విధంగా బోర్డులు ఏర్పాటు చేసి వదిలేశారు. ప్రభుత్వం ప్రతీ పంచాయతీకి స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేసింది. వీటి ద్వారా యువకులు ఆటల ద్వారా నైపుణ్యం పెంచుకునే అవకాశం ఉంది.

● దుస్థితిలో క్రీడా ప్రాంగణాలు

సుంకిని, కారేగాం, చేతన్ నగర్, ఎత్తొండతో పాటు పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. పాఠశాల ఆవరణలో బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. చేతన్‌నగర్‌లో వ్యాయామ పరికరాలు నేలమట్టమయ్యాయి, హెగ్డోలి గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగి వృథాగా మారింది.



నేలమట్టమైన క్రీడా పరికరాలు

● వినియోగంలోకి తీసుకువస్తాం..



శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో, కోటగిరి

గ్రామాల్లో నిరుపయోగంగా క్రీడ ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం. పలు క్రీడా ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేస్తామన్నారు. క్రీడాప్రాంగణాల్లో పరికరాలను ఏర్పాటు చేసి యువకులు క్రీడలు ఆడేలా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

వాతావరణ కేంద్రం పరిశీలన


వాతావరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

కామారెడ్డిటౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ఆధ్వర్యంలో సీఈవో షేక్‌మీరా ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని డోంగ్లి, బొమ్మన్‌దేవునిపల్లి ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాన్ని పరిశీలించినట్లు జిల్లా సీపీఓ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీడీపీఎస్ నుంచి భార్గవరెడ్డి, జిల్లా టెక్నీషియన్ అనిల్‌రెడ్డి, ఎంపీఎస్‌ఓ దత్తు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో పార్ట్ టైం ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాడ్వాయి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుకుల పాఠశాలలో బాలికల కళాశాలలో పార్ట్ టైం ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శిరీష తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో టీజీటీ ఇంగ్లీషు సబ్జెక్టు బోధించుటకు బీఈడీ పీజీ చేసిన అనుభవం ఉన్న మహిళ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. డెమో సర్టిఫికెట్ల ఆధారంగా నిర్ధారణ ఉంటుందని అన్నారు . ఆసక్తి కలవారు ఈ నెల 30వ తేదీ సోమవారం హాజరుకావాలని తెలిపారు. మిగతా విషయాలు నిర్ధారించుటకు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శిరీషను సంప్రదించాలని తెలిపారు.

జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు మండల క్రీడాకారిణి ఎంపిక


సంజన

గాంధారి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):జాతీయ స్థాయి షుటింగ్‌బాల్ పోటిలకు పోతంగల్ గ్రామానికి చెందిన సంజన అనే క్రీడాకారిణి ఎంపికైనట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయికుమార్, ప్రధానకార్యదర్శి లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. ఈనెల 27 నుంచి 30 వరకు పశ్చిమబెంగాల్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి పోటిలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు వారు తెలిపారు.

అర్చరీ క్రీడాకారులకు సన్మానం


క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

దోమకొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గడికోటకు చెందిన అర్చరీ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రెండు సిల్వర్ మోడల్స్ సాధించినట్లు కోచ్ ప్రతాప్‌దాస్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఇందు, అనుదీప్‌లను జిల్లా అర్చరీ అధ్యక్షుడు తీగల తిర్మల్‌గౌడ్ అభినందించారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, పున్న లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'హెచ్‌ఎంపై దాడిని ఖండిస్తున్నాం'

కామారెడ్డిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తక్కుగూడలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న దళిత ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడిచేయడాన్ని ఖండిస్తున్నామని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయసంఘంరాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి అయ్యప్పమాల వేసుకోని పాఠశాలకు రావడంతో అనుకోకుండా కాలు తగిలినందున ఆ పాఠశాలలోకి కొంతమంది అయ్యప్ప భక్తులు, ఇతరులు వచ్చి దేవునిపేరుతో దాడిచేయడంతో పాటు విద్యార్థి కాలు మొక్కించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఎస్సీఎస్టీ కమీషన్ దీన్ని సుమోటోగా తీసుకుని వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వెంటనే దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామని హెచ్చరించారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళ్లు


గురుకుల పాఠశాలలో మౌనం పాటిస్తున్న విద్యార్థులు, సిబ్బంది


బరంగేడ్గిలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మద్నూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల, విద్యాలయంలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతికి నివాళ్లు అర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వక్తలు మాట్లాడుతూ మహనీయుల చరిత్రలు స్ఫూర్తిదాయకమని, అటువంటి వారిలో మాజీ ప్రధానీ మంత్రి మన్మోహన్ సింగ్ ఒకరని పేర్కొన్నారు. తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయము, జూనియర్ కళాశాలలో ఉదయం ప్రార్థన సమయములో మాజీ ప్రధానీ స్వర్గీయ మన్మోహన్ సింగ్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించారు. నివాళి అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన జీవితచరిత్రను, ఆయన రూపొందించిన పది ఆర్థికసూత్రాలను వక్తలు గుర్తుచేశారు. మన్మోహన్ సింగ్ భారత ప్రధానిగా అమూల్యమైన సేవలను అందించారని అన్నారు. . వెంకట్ మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఆర్థిక వ్యవస్థను సరళీకరణను చేశారని అన్నా రు. ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు, అణు ఒప్పందం, ఆధార్ పథకం, విద్యాహక్కు, భారతదేశం ఆర్థికాభివృద్ధి వేగం, మహిళా రిజర్వేషన్ సాధి కారత, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, సామాజిక ఆరోగ్య సంస్కరణలు వంటివి రూపొందించి అమలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్ర మంలో గురుకుల పాఠశాల, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. ఈ మేరకు బీర్కూర్ మండలం బరంగ్ఎడ్గిలో మాల సంఘం ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో కీలక పాత్ర పోషించి, దేశ అభివృద్ధికి ఎంతోగానో కృషి చేసారన్నారు.ఈ కార్యక్రమంలో రాములు, ప్రవీణ్, గంగాధర్, సి ద్దార్థ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తకు సంతాపం తెలిపిన నాయకులు

దోమకొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువజన నాయకులు సీతారాం ప్రసాద్(45) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లి యువజన నాయకులు ఇలీయాస్, రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, గ్రంథాలయ శాఖ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి ఆయన మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, గాల్‌రెడ్డి, బల్యాల సుదర్శన్, మండలాధ్యక్షుడు అనంత్ రెడ్డి, తాటిపల్లి శ్రీకాంత్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, శంకర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, సిద్దారెడ్డి, షమ్మీ, రవి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో మత్తడి కాలువ పనుల పరిశీలన

లింగంపేట,డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండల కేంద్రంలోని మ త్తడి కాలువ పనులను శనివారం డీఈ మనోహర్ పరిశీలించారు. రూ.49 లక్షలతో జరుగుతున్న మత్తడి కాలువ పునరుద్ధరణ పనులను ఆయన పరిశీలిం చారు. పనులు నాణ్యతగా చేపట్టాలని, క్యూరింగ్ సక్రమంగా నిర్వహించాలని ఆ యన తెలి యజేశారు. పనులు వేగవంతంగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

సిద్ధరామేశ్వరనగర్‌లో దొంగతనం

భిక్కనూరు, డిసెంబరు 28:మండలంలోని సిద్ధరామేశ్వర నగర్ గ్రామంలో దొంగతనం జరిగినట్లు భిక్కనూరు ఏఎస్సై జగదీష్ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన బాబుమియా ఇందల్‌వాయిలో దాబా నడిపిస్తుండగా అతడి భార్య అతని వద్దకు గత గురువారం ఇంటికి తాళం వేసి వెళ్లగా అదేరాత్రి దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడి బీరువాలో దాచిపెట్టిన రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కాగా సంఘటన స్థలానికి క్లూస్ టీం చేరుకుని వేలిముద్రలను సేకరించారు. బాధితుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కాచాపూర్‌లో బీజేపీ గ్రామకమిటీ సమావేశం

భిక్కనూరు, డిసెంబరు 28: భిక్కనూరు మండలంలోని కాచాపూర్ గ్రామంలో బీజేపీ గ్రామశాఖ ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థాగత మార్పులో భాగంగా 107బూత్ అధ్యక్షుడిగా అంజిరెడ్డి, 108బూత్ అధ్యక్షుడిగా పర్శరాములు, 109బూత్ అధ్యక్షుడిగా శివరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

● సబ్ కలెక్టర్‌కు విద్యార్థి సంఘాల వినతి

బాన్సువాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ శనివారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి జిల్లా లంబాడీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు రాథోడ్ జీవన్ నాయక్ బా న్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీవన్ మాట్లాడు తూ గత నాలుగు ఐదు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్ స్కాలర్షిప్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు అదేవిధంగా పేద విద్యార్థులు చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి వచ్చింది కావున ప్రభుత్వం వెంటనే సందించి గత నాలుగు సంవత్సరాలుగా బకాయిలు మొత్తం చెల్లించాల్సిందిగా మేము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వికాస్ నాయక్ బాన్సువాడ నగర సభ్యులు గబ్బర్ నాయక్ తదితరులు పాల్గొ న్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కామారెడ్డిటౌన్,డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని,మల్టీపర్పస్ విధానం రద్దుచేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తు శనివారం కలెక్టరేట్ వద్ద గ్రామపంచాయతీ కార్మికులు నిరసన తెలిపి ఏవో అహ్మద్‌కు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్‌మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలుపలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. 6 నెలల నుంచి వేతనాలు రాక చాలిచాలని వేతనాలతో ఆర్థికంగా కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.కార్మికులను రెగ్యులర్ చేయడంతో పాటు వారికి పలురకాల బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాలనర్సు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజన్న,జిల్లా కార్యదర్శి సాయిలు, రూప్‌సింగ్, బాలనర్సు తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయం ప్రారంభానికి ముస్తాబు

నిజాంసాగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానికల సంస్థ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు సాధించేందుకు మండల స్థాయిలో కార్యాలయ ఏర్పాటుతోపాటు గ్రామ గ్రామాన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు బలోపేతం చేయడానికి శ్రీకారం చుట్టింది నిజాంసాగర్ ఉమ్మిడి మండలాల్లో బిఆర్ఎస్ పార్టీ పార్టీని బలోపేతం చేయడానికి మహమ్మద్ నగర్, నిజాంసాగర్ మండల కేంద్రాల్లో పార్టీ కార్యాలయ ఏర్పాట్లు బీఆర్ఎస్ నాయకులు నిమగ్నమయ్యారు. తాజాగా నిజాంసాగర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు పార్టీ సీనియర్ నాయకులు నిమగ్నమయ్యారు. నిజాంసాగర్ మండల కేంద్రంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసినందుకు ముస్తాబు చేస్తున్నారు. త్వరలో ఈ కార్యాలయాన్ని తాజా మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభించేందుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిమగ్నమయ్యారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోటోలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యాలయ ఏర్పాటుకు రూపు రేఖల దిద్దడంలో సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ దుర్గారెడ్డి, మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రమేష్ గౌడ్, మాజీ ఎంపీపీ, ఉపాధ్యక్షులు మనోహర్, మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షులు విట్టల్, మాజీ సర్పంచులు రాజు, అంజయ్య, నాయకులు మేకల విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఎరువుల నిల్వల పరిశీలన

మాచారెడ్డి,డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలంలోని సొసైటిలో నిల్వ ఉన్న ఎరువులను డీఏఓ తిరుమలప్రసాద్,ఏడీఏ లు పరిశీలించి నిల్వలు ఎన్ని ఉన్నాయనే దానిపై ఆరాతీశారు. సొసైటిలో 62 బస్తాల యూరియా, కాంప్లెక్స్ 40 బస్తాలు ఉన్నట్లు వివరించారు.ఎల్లంపేట, ఎల్పుగొండ,ఫరిద్‌పేట్,భవానిపేట్ అన్నిట్లో కలుపుకోని 1900 బస్తాల యూరియా, 240 బస్తాల కాంప్లెక్స్ ఎరువులు ఉన్నట్లు తెలిపారు.సరిపడ ఎరువులు ఉన్నాయని రైతులు ఎలాంటి ఇబ్బందులు పడవద్దని తెలిపారు.


అధికారులతో మాట్లాడుతున్న ఏడీఏ

సింగిల్ విండో అభివృద్ధికి కృషిచేస్తా


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

గాంధారి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సింగిల్‌విండో అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. సింగిల్‌విండో పాలకవర్గంతో మాట్లాడుతూ గతంలో కంటే ఎక్కువగా రుణాలు ఇచ్చారని రైతులకు ఎంతో సేవచేసే అంత గుర్తు చేశారని తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులను సరాఫరాచేయాలన్నారు. రుణమాఫీ అయిన రైతులందరికి కొత్తగా రుణాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయి కుమార్, కార్యదర్శి సాయిలు, వైస్ చైర్మన్ ఉద్దల్‌సింగ్, డైరెక్టర్‌లు సంతోష్, గణపతి, లక్ష్మన్, శివాజీరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో మధ్యాహ్న భోజనం పరిశీలన

మద్నూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ, మోడల్ పాఠశాలల కాంట్రాక్టు ఉపాధ్యాయులతో పాటు ఎస్‌ఓల సమ్మె నేపథ్యంలో కేజీబీవీలో మధ్యాహ్న భోజన పర్యవేక్షణ అధికార వంతైంది. మద్నూర్ కేజీబీవీ విద్యాలయంలో శనివారం మండల ఎంఈవో రాములు మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించారు. భోజనం పరిశీలించడానికి అధికారులు వస్తున్నప్పటికీ. ఇటీవల ప్రభుత్వం సర్వ శిక్షా ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ఆయా పాఠశాలల్లోకి ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్టేషన్‌పై పంపించాలని అధికారులను ఆదేశించారు. కానీ ఆయా ఉపాధ్యాయులను విద్యార్థులను బోధించటానికి డిప్యూటేషన్‌పై వేసినప్పటికీ యూనియన్ వాళ్ల వల్ల ఉపాధ్యాయులు పిల్లలను బోధించడానికి రావడం లేదని ఎంఈవో తెలిపారు.


బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్పీ

బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ సింధూశర్మ

బాన్సువాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పోలీస్ స్టేషన్‌ను శనివారం జిల్లా ఎస్పీ సింధూశర్మ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ వివరాలను, రికార్డులను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది పనితీరు పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని కేసుల సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ సత్యనారాయణ, పట్టణ సీఐ అశోక్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య


లింగాల అలియాస్ కుమార్ (ఫైల్)

బీర్కూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని తీవ్ర మానసిక వేదనకు గురైన ఒక భర్త ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండల కేంద్రంలోని ఇందిరా కాలనీకి చెందిన లింగారం అలియాస్ కుమార్ (34) అనే యువకుడికి పదేళ్ల క్రితం జుక్కల్ మండలం కండె బల్లూర్ కు చెందిన మమతతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. గత కొన్నాళ్లుగా భార్య భర్తల మధ్య మనస్పర్ధలు తలెత్తాయి. ఆరు నెలల క్రితం మమత పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. అనంతరం లింగారం తల్లి, అన్నా వదినలతో కలిసి బ్రతుకు తెరువు కోసం నిజామాబాద్ కు వెళ్లారు. అక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లింగారం శుక్రవారం ఒక పని నిమిత్తం బీర్కూర్‌కు వచ్చాడు. అందరితో కలిసి మాట్లాడాడు. రాత్రి ఇంటికి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. శనివారం ఉదయం ఎంతకు తలుపులు తెరవక పోవడంతో చుట్టు పక్కల వారు కిటికీలో నుండి చూడగా లింగారం ఉరి వేసుకుని ఉన్నట్టు గమనిం చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. మృతుడి తల్లి గంగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాన్సు వాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. భార్య కాపురానికి రావడం లేదని బాధపడేవాడని ఆ బాధతోనే తన కొడుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లి గంగమణి ఫిర్యాదులో పేర్కొంది.

కుంటలో పడి ఒకరి మృతి

మాచారెడ్డి,డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):పాల్వంచ మండలంలోని మంతన్‌దేవునిపల్లి గ్రామానికి చెందిన గుండెల్ని దేవరాజు (39) పాల్వంచ చామల కుంటలో పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.ఈనెల 25 న డప్పు పగిపోయిందని కామారెడ్డికి వెళ్లి బాగుచేయించుకుని వస్తానని చెప్పి ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదని 27 న శవం కుంటలో ఉన్నాడని తెలిపారు. కాలకృత్యాలు లేదా తాగిన మత్తులో కుంట వద్దకు వెళ్లి కుంటలో పడి ఊపిరాడక చనిపోయాడని మృతుని భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎరువులు, పురుగుల మందుల షాపుల తనిఖీ


బీర్కూర్‌లో ఎరువులు, పురుగుల మందుల షాప్‌లను తనిఖీ చేస్తున్న ఏడీఏ అరుణ

బీర్కూర్,డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని ఎరువులు, పురుగుల మందుల షాప్‌లలో శనివారం బాన్సువాడ వ్యవసాయ శాఖ ఏడీఏ అరుణ తనిఖీలు నిర్వహించారు.నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు

కామారెడ్డిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను మంజూరుచేయించినట్లు ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఉన్న సబ్‌స్టేషన్‌లపై లోడ్ ఎక్కువ పడడంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఏదైనా సమస్య ఏర్పడినప్పుడు కామారెడ్డిసబ్‌స్టేషన్‌ల నుంచి అధికారులు విద్యుత్ సరాఫరాచేస్తున్నారని దీంతో పలు సందర్భాలలో విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. దీంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఅండ్ ఎండీ ఆఫ్ ఎన్‌పీడీసీఎల్ వరంగల్ కర్నాటి వరుణ్‌రెడ్డితో మాట్లాడి కామారెడ్డిపట్టణానికి సబ్‌స్టేషన్ మంజూరు చేయించానని తెలిపారు.సబ్‌స్టేషన్ మరో రెండు,మూడు నెలలో అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

బూత్ కమిటీల ఎన్నిక

మాచారెడ్డి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీరావుపల్లి, అక్కాపూర్,ఎల్లంపేట గ్రామాల్లో ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి ఆదేశాల మేరకు బూత్ కమిటిల ఎన్నికను నిర్వహించినట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డితెలిపారు. లక్ష్మీరావులపల్లి బూత్ అధ్యక్షుడిగా దేవయ్య, అక్కాపూర్ 20వ బూత్ అధ్యక్షుడిగా స్వామి,ఎల్లంపేట 13వ బూత్ అధ్యక్షుడిగా రాందాస్, 14వ బూత్ అధ్యక్షుడిగా పెంటయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పోన్నాల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు సురేష్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఆర్థికసాయం అందజేత

ఎల్లారెడ్డి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన కర్రోల్ల లక్ష్మీ అనే మహిళ కొన్ని రోజులుగా అనారోగ్యం తో బాధపడుతూ మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందించి మనోధైర్యం కల్పించారు. ఆయనతో పాటు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సామెల్, సొసైటీ డైరెక్టర్ సాయిలు, సుఖేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంతోష్ నాయక్ పాల్గొన్నారు.

జగద్గురు నరేంద్రా చార్య ఉప పీఠం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు

మద్నూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనంత శ్రీ విభూషత్ జగద్గురు రామానందచార్య శ్రీ స్వామి నరేంద్రాచార్య మహరాజ్ జుక్కల్ ఉపపీఠం ఆధ్వర్యంలో జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు. నిర్వాహకులు తెలిపారు. ఒకరు చేసే రక్తదానం మరొకరికి ప్రాణదానమవుతుందని శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంత పురోగతి సాధించిన రక్తాన్ని మనిషి నుంచి సేకరించాల్సిందే తప్ప కృత్రిమంగా తయారు చేయలేమని, రోడ్డు ప్రమాదాలు గాయపడిన అప్పుడు కాన్పులు, ఆపరేషన్స్ సందర్భాల్లో ఇతర ఏ కారణంతో నైనా రక్తాన్ని కోల్పోయినప్పుడు రక్తహీనత ఉన్న రక్తం ఎక్కించాల్సి వస్తుందని అవసరమైన సందర్భాల్లో వెతికితే అవసరమైన రక్తం దొరకదని. అందుకే నరేంద్ర చార్య మహారాజ్ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి యువకులకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు రక్త దానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలు రక్షింపబడతాయని అన్నారు. ఈ శిబిరాల్లో యువకులు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. ఈ శిబిరాలు పెద్ద కొడప్‌గల్ జనవరి 6వ తేదిన, మద్నూర్‌లో 8న, బిచ్కుందలో 11, జుక్కల్‌లో 17న, పిట్లంలో 19న జుక్కల్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ఆయా మండలాల్లో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ శిబిరాల్లో యువకులు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

శాంతి	- రోటి కపడా రొమాన్స్
దర్శన్	- యూఐ
ప్రియా 70	- పుష్ప-2
ప్రియా 35	- మ్యాక్స్

బాన్సువాడ

మహేశ్వరి	- పుష్ప-2
వెంకటేశ్వర	- మ్యాక్స్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

